క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సబ్‌స్టేషన్ ఏఈ చైతన్య భార్గవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ గాజులరామారం ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గాజులరామారం ప్రధాన రోడ్డు, తత్వా స్కూల్, ప్రిస్టిన్ ప్యాలెస్, బాలాజీ లేఅవుట్, ఉషోదయ కాలనీ, 11కేవీ మహదేవపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యండమూరి లేఅవుట్, మహదేవపురం, ద్వారకానగర్, రాంకీ ఎస్టేట్స్, సంస్కృతి ఎన్‌క్లేవ్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండని ఏఈ తెలిపారు.

నిజాంపేట్, ఎస్‌ఎల్‌జీ, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో..

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ నిజాంపేట్, ఎస్‌ఎల్‌జీ, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీనివాస లేక్‌వ్యూ, శ్రీకర విల్లాస్, బాచుపల్లి సిగ్నల్స్, బాచుపల్లి తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది

వైఎస్సార్‌టీపీ నేత దేశిరెడ్డి సురేష్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని వైఎస్సార్‌టీపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో.ఆర్డినేటర్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసింది. చేసిన అప్పులు తీర్చడానికి ప్రభుత్వ భూములను విక్రయిస్తోందని ఆరోపించారు. ఇదే విధంగా భూములను అమ్ముకుంటూ పోతే రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు అద్దె భవనాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో భూముల విలువ కోట్లలో పెరగడంతో సామాన్యుడి కొనలేని పరిస్థితి ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్, సాయి విద్యానికేతన్ పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ జోన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జగన్, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రేస్ మల్లారెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డితో కలిసి శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు, ప్రిన్సిపల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవైఎం దుండిగల్ అధ్యక్షుడిగా రాజశేఖర్

దుండిగల్: అఖిల భారత యాదవ మహాసభ (ఏబీవైఎం) దుండిగల్ మున్సిపల్ సంఘం అధ్యక్షుడిగా డి.పోచంపల్లికి చెందిన ఆనబోయిన రాజశేఖర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం గండిమైసమ్మ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేకే శేఖర్‌యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సోమేశ్‌యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ యాదవ్ మాట్లాడుతూ యాదవ కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణాయాదవ్, సాయిబాబా యాదవ్, రవిందర్ యాదవ్, మల్లేశ్ యాదవ్, శ్రీశైలం యాదవ్, వెంకటేశ్ యాదవ్, కృష్ణ యాదవ్, పాపయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

చింతల్: అభివృద్ధి పనుల విషయంలో ప్రజలు సహకరించాలని చింతల్ కార్పొరేటర్ రషీదా బేగం అన్నారు. వివేకానంద్‌నగర్‌లో రూ.1.20 కోట్ల నిధులతో చేపడుతున్న రోడ్డు పనులను గురువారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రషీదా మాట్లాడుతూ.. చింతల్ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పు చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో బస్తీ ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఏఈ సంపత్, ఎస్‌పీసీ ఏఈ నాగరాజు, సంక్షేమ సంఘాల నాయకులు చందు, యాదగిరి, విజయలక్ష్మి, స్వప్న, చలమారెడ్డి, మాలతీ, కోటా ప్రసాద్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.



పర్యవేక్షణ కొరవడి.. గాడి తప్పుతున్న బడి

- ఈ ఇన్‌చార్జ్‌లు అంతా పాఠశాల ప్రధానోపాధ్యాయులు
- ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు 5 నుంచి 7 మండలాల బాధ్యతలు
- జిల్లాలో 505 ప్రభుత్వ, 10 ఎయిడెడ్, 1350 ప్రైవేట్ పాఠశాలు
- ఈ బడుల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 5.10 లక్షలు
- మండలాల్లో పర్యటనలు లేక చతికిల పడుతున్న విద్యావ్యవస్థ

జిల్లాలో అన్ని మండలాలకు ఎంఈఓలు అంతా ఇన్‌చార్జిలే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే, ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు 5 నుంచి 7 మండలాలను అదనపు బాధ్యతగా పర్యవేక్షించాల్సి పరిస్థితి జిల్లా విద్యాశాఖలో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. గతంలో మాదిరిగా ఎంఈఓల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో బడి గాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఎంలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో వారు విధులు నిర్వర్తిస్తున్న ఉన్నత పాఠశాలలకు, అటు ఎంఈవో పదవులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు చేపడుతున్నా.. కార్యరూపం దాల్చడంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న హెచ్‌ఎంలు తమ బడితో పాటు కనీసం 20 పాఠశాలలను నెలలో పర్యవేక్షించాల్సి ఉన్నా.. అది నెరవేరడం లేదని తెలుస్తోంది.

◆ జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలలు, 10 ఎయిడెడ్ పాఠశాలలు, 1,350 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ఇందులో 5.10 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ముగ్గురు ఇన్‌చార్జి ఎంఈఓలు తమ మండలాల పరిధిలోని పాఠశాలల పర్యటనతో సహా అధికారిక కార్యక్రమాలు, మన ఊరు–మన బస్తీ–మన బడి పర్యవేక్షణ, సమీక్షలకు హాజరు కావడం, మధ్యాహ్న భోజన నివేదికలు, మరుగుదొడ్లు, తాగునీరు అదనపు గదుల నిర్మాణాలు, బోధన, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పర్యవేక్షణ, జీతభత్యాలు, నివేదికలు పంపడం వంటి పనులకే వారి సమయం సరిపోతోంది.

◆ జిల్లాలో మొత్తంగా ఉన్న 15 మండలాలకు ముగ్గురు హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. భగత్‌సింగ్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలానగర్, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్, కూకట్‌పల్లి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తూముకుంట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కూడా మేడ్చల్, శామీర్‌పేట, ఎంసీపల్లి మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కీసర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కూడా మిగిలిన మల్కాజిగిరి, అల్వాల్, ఘట్‌కేసర్, ఉప్పల్, మేడిపల్లి, కీసర, కాప్రా మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయనే విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ప్రతిష్టంభన..

పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లాస్థాయిలో డీఈవో, సెక్టోరియల్ అధికారులు మాత్రమే చూస్తున్నారు. ప్రభుత్వం జిల్లా ఉప విద్యాధికారుల పోస్టులను ఎత్తివేసింది. రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలులో నెలకొన్న జాప్యంతో పదోన్నతుల ప్రక్రియలో ప్రతిష్టంభన నెలకొంది. ఈ కారణంగా ఎంఈవోల నియామకం జరగడం లేదు. జిల్లాలో మొత్తంగా ఉన్న 15 మండలాలకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ

నిజాంపేట్: గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం, సంరక్షులతో నివసించే అనాథల సర్వే విషయమై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థలమున్న నిరుపేదలకు ఇళ్ల నిర్మించేందుకు సీఎం కేసీఆర్ రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ సహాయం అందుతుందన్నారు. గ్రామ కంఠంలో స్థలాలకు దస్తావేజు పేపర్లు ఉండవని, ఖాళీ స్థలం ఉన్నా సరే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు విజయలక్ష్మి, చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, గాజుల సుజాత, కాసాని సుధాకర్ ముదిరాజ్, బాలాజీ నాయక్, శ్రీనివాస్ యాదవ్, వెంకటరామయ్య, ఆయా విభాగాల అధికారులు తదితరులు ఉన్నారు.



అధికారులతో గృహలక్ష్మి పథకంపై ప్రత్యేక సమావేశమైన మేయర్ నీలారెడ్డి

క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం



షాపూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

సుభాష్‌నగర్: క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని వామపక్ష నేతలు నినందించారు. గురువారం సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహాపడావ్‌లో భాగంగా షాపూర్‌నగర్ రైతు బజారు నుంచి సాగర్ హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కీలుకాని లక్ష్మణ్, ఉమామహేష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. దేశం మొత్తానికి ఉమ్మడి పౌరస్మృతి ఉండాలంటున్న పాలకులు దేశ సంపదపై కూడా ప్రజలందరికీ సమాన హక్కు కల్పించాలన్నారు. నిత్యవసరాల ధరలు ఆకాశానంటాయని, సామాన్య ప్రజల నుంచి పన్నుల రూపంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

◆ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలపై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవదానం, అంజయ్య, దుర్గా నాయక్, ఏఐటియుసి నాయకులు స్వామి, హరినాథ్, శ్రీనివాస్, సింగిరెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలి

దుండిగల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల కోశాధికారి మర్రి మమతారెడ్డి అన్నారు. ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో రోగులకు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అదే విధంగా రోగుల సౌకర్యార్థం వీల్ చైర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మమతారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే తమ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం పలు గ్రామాలను దత్తత తీసుకుని సామాజిక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. విద్యార్థుల సామాజిక స్పృహను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అరునాబ్ మాలిక్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ప్రవళిక, అంజన సరస్వతి, ఆస్పత్రి డీన్ ఉదయ్‌కుమార్, బాలాజీ గోగినేని తదితరులు పాల్గొన్నారు.



వీల్ చైర్ అందజేస్తున్న మర్రి మమతారెడ్డి

అడోలసెంట్ లైఫ్ స్కిల్స్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న జి.శివకుమార్, డా. జోసెఫ్ ఇమ్మాన్యుయేల్



నేషనల్ స్కూల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్ ఎగ్జిబిషన్ లైఫ్ స్కిల్క్‌వేర్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో గురువారం ఎక్స్‌ప్రెషన్స్ ఇండియా, హైదరాబాద్ సహోదయ స్కూల్స్ కాంప్లెక్స్ భాగస్వామ్యంతో సీబీఎస్ఈ జీ–20 అడోలసెంట్ లైఫ్ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటరాక్టివ్ యాక్టివిటీలు, గ్రూప్ డిస్కషన్, పార్టిసిపెంట్‌ల ద్వారా నైపుణ్యాలను పెంపొందించేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఏడబ్ల్యూ మేజర్ జి.శివకిరణ్, సీబీఎస్ఈ జాయింట్ సెక్రటరీ (అకడమిక్స్) డాక్టర్ జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు నేషనల్ స్కూల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్ ఎగ్జిబిషన్ లైఫ్ స్కిల్క్‌వేర్ కార్యక్రమాలతో పాటు మానసిక ఆరోగ్యంపై విజ్ క్విజ్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు.

అధికారుల నిర్లక్ష్యం.. వృథాగా ప్రజాధనం

రంగారెడ్డినగర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం నష్టపోవాల్సి వస్తోంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన వీధులు, రోడ్లపై రాత్రివేళల్లో విద్యుత్ వెలుగులను నింపేందుకు లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి హైమాస్ట్ స్తంభాలు, విద్యుత్ దీపాల స్తంభాలను నాటారు. అయితే వాహనాలు ఢీకొని కొన్ని.. నాణ్యత లోపంతో కొన్ని స్తంభాలు నేలకొరిగి రోడ్ల పక్కన దర్శనమిస్తున్నాయి. వెంకట్రామిరెడ్డినగర్ రోడ్డులో హెచ్‌ఎంటీ స్థలాన్ని ఆనుకుని హైమాస్ట్ లైట్ల స్తంభం కొన్ని నెలలుగా వృథాగా పడి ఉంది. అదే విధంగా సర్కిల్ కార్యాలయాన్ని ఆనుకునే ఓ స్తంభం నేలకొరిగింది. ఇలా జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నింపేందుకు ఏర్పాటు చేసిన స్తంభాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తప్పు పడుతున్నాయి.





ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం




ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజుకు సమస్యలను నివేదిస్తున్న పలు ప్రాంతాల ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సుపరిపాలన అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వీటిపై స్పందించిన శంభీపూర్ రాజు సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే గృహలక్ష్మి పథకం

దుండిగల్: సొంత స్థలం ఉన్న వారికి సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని గురువారం ఆయన వైస్‌చైర్మన్ పద్మారావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ముందుగా 3వేల మందికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, భరత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టిఫీషియల్ వాటర్ ఫాల్



బహదూర్‌పల్లిలోని మహేంద్ర యూనివర్సిటీలో రాళ్ల బండలతో కూడిన ఓ గుట్టను వాటర్ ఫాల్స్‌గా మార్చారు. గుట్ట చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి గుట్టపై నుంచి వాటర్ దిగువ ప్రాంతానికి వెళ్లే మాదిరిగా చేయడంతో అచ్చం వాటర్ ఫాల్స్‌లా కనిపిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది.
– సుభాష్‌నగర్

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించింది

ఎమ్మెల్యే వివేకానంద్



విశ్వకర్మకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా గురువారం ఆయన సూరారం డివిజన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.48 లక్షలతో చేపట్టనున్న అంతర్గత రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్థానికంగా రూ.3.88 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలకు ఏ సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అభివృద్ధి పనులకు నిధుల ఢోకా లేకుండా పురపాలక మంత్రి కేటీఆర్ సహకారంతో పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈఈ శిరీష, ఏఈ సంపత్, మేడ్చల్ జిల్లాఈ ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, వేణు యాదవ్, ఇంద్రసేన గుప్తా, రవి, కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రతినెల 7వ తేదీలోపు జీతాలు చెల్లించాలి



మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నిజాంపేట్: కార్మికుల జీతాలను పెంచి దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. గురువారం కార్మికుల జీతాల విషయమై నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు చెప్పులు, ఊడ్చడానికి చీపుర్లు ఇవ్వడం లేదన్నారు.

– ప్రతినెల 7వ తేదీ వరకు వేయాల్సిన జీతాలకు 25వ తేదీ వరకు వేచి చూడాల్సి వస్తోందన్నారు. మున్సిపల్ కార్మికులకు వెయ్యి రూపాయలు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించి మూడు నెలలు కావస్తున్నా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్మికులకు జీతాలు పెంచి 7వ తేదీలోపు జీతాలు చెల్లించని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఏఐటీయూసీ కార్పొరేషన్ అధ్యక్షుడు యాదయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఇరువైపులా పార్కింగ్.. వాహనదారులు పరేషాన్



రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతుండడంతో ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్

దుండిగల్: పాఠశాల బస్సులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ప్రతిరోజు తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. బౌరంపేట ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గ్రామానికి వచ్చే దారిలో ఓ ఇంటర్నేషనల్ స్కూల్ ఉంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా స్కూల్ బస్సులతో పాటు తల్లిదండ్రుల వాహనాలను నిలుపుతున్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతుండగా ప్రధాన రోడ్డు కావడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయంపై పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని కోరుతున్నారు.



నేడు 33రకాల పదార్థాలతో వాయనాలు

జగద్గిరిగుట్ట: అధిక శ్రావణమాసం సందర్భంగా అంజయ్యనగర్‌లోని భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం 33రకాల పదార్థాలతో వాయనాలు సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం కంకుమార్చన ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.



డెలివరీ బాయ్‌పై దాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

జీడిమెట్ల: అమెజాన్ డెలివరీ బాయ్‌పై దాడి జరిగిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్ వివరాల మేరకు మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతానికి చెందిన షేక్ రెహాన్ ఫయాజ్(20) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గాజులరామారంలోని ఇందిరానగర్‌లో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొన్ని నెలలుగా ఫయాజ్ అమెజాన్ సంస్థలో వస్తువులను వినియోగదారులకు అందించేందుకు డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు.

◆ ఈనెల 5వ తేదీన కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో వస్తువులను అందించేందుకు వచ్చాడు. ఓ ప్రొడక్ట్‌ను వినియోగదారునికి ఇచ్చేందుకు ఫోన్ చేయగా వాట్సప్ ద్వారా లోకేషన్ పంపాడు. సదరు అడ్రస్‌కు వెళ్లి వస్తువును ఇవ్వగా డెలివరీలో జాప్యం జరిగిందని గొడవ జరిగింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆరుగురు వ్యక్తులతో పాటు విశాల్ అనే వ్యక్తి దాడికి పాల్పడినట్లు బాధితుడు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆ గొడవకు నాకు సంబంధం లేదు: విశాల్

నాకు గొడవకు ఎలాంటి సంబంధం లేదు. సదరు వ్యక్తి మా కాలనీకి వచ్చి పార్కు వద్ద గంజాయి సేవించిన మత్తులో ఉన్నాడు. దీంతో బయట ఉన్న యువకులు సదరు వ్యక్తి దొంగతనానికి వచ్చినట్లుగా అనుమానంతో దాడి చేశారు. నాకు సంబంధం లేకపోయిన కొంతమంది కావాలని నేను దాడి చేసినట్లు పీఎస్‌లో ఫిర్యాదు చేయించారు. కాగా బాధితుడు ఒక వీడియోలో ఓ మంత్రి దాడి చేశాడని తెలిపాడన్నారు. నాతో పాటు సదరు మంత్రిపై సైతం కేసు నమోదు చేయాలన్నారు.